క్లుప్తంగా

27 నుంచి చిన్నమ్మతల్లి పండగ



రామభద్రపురంలోని చిన్నమ్మ తల్లి అమ్మవారి ఆలయం

రామభద్రపురం: మండల కేంద్రంలో ఈ నెల 27వ తేదీ నుంచి చిన్నమ్మతల్లి పండగ నిర్వహిస్తున్నట్లు చిన్నమ్మతల్లి కమిటీ సభ్యులు తెలిపారు. ఇదే విషయమై ఆదివారం గ్రామపెద్దలు, కమిటీ సభ్యులు సమావేశమై ఉత్సవ నిర్వహణ, ఏర్పాట్లపై చర్చించారు. ఈ నెల 13వ తేదీన అమ్మవారిని గ్రామంలోని గద్దెకు తెచ్చి, మూడు వారాల పాటు తిరువీధి నిర్వహిస్తారు. 26వ తేదీన సిర్లి పోతన్న పండగ, 27, 28, మార్చి 1వ తేదీల్లో అమ్మవారి పండగ చేసేందుకు నిర్ణయించారు.

వైభవంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం



పార్వతీపరమశ్వరుల కల్యాణం జరుపుతున్న వేదపండింతులు

బాడంగి: మండలంలోని పిన్నవలస గ్రామ శివాలయంలో శివలింగం ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం బ్రహ్మశ్రీ అంపోలు ఉమామహేశ్వరశర్మ వేదమంత్రోచ్చరణల నడుమ పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు స్వామి వారి కల్యాణం తిలకించేందుకు పోటీపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శంబంగి వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు.

ప్రశాంతంగా హిందీ పరీక్షలు



హిందీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

రాజాం: మండలంలో పెనుబాక పాఠశాల కేంద్రంలో దక్షిణ భారత హిందీ ప్రచార సభ(చెన్నై) ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన హిందీ పరీక్షలు ఆదివారంతో ముగిశాయి. పరిచయ్, ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర, ప్రవేశిక, విశారద, ప్రవీణ విభాగాల్లో ఈ పరీక్షలు నిర్వహించినట్లు హిందీ ప్రచారక్ కె.మధుసూదనరావు తెలిపారు. మొత్తం 164 మందికి గాను 160 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరైనట్లు వెల్లడించారు. పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా పి.బలరామ్మూర్తి, ఇన్విజిలేటర్లుగా రామకృష్ణ, గౌరీశంకర్, శ్రీనివాసరావు, మధుసూదనరావు వ్యవహరించారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



మెట్టవలసలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులు

బొబ్బిలి రూరల్: మండలంలోని మెట్టవలస గ్రామంలో పారిశుద్ధ్య పనులు చాలా చురుగ్గా కొనసాగుతున్నాయి. ఆదివారం గ్రామంలోని ప్రధాన వీధులు, కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, మురుగును తొలగించారు.

విద్యార్థుల చదువు, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

బాడంగి: విద్యార్థుల ఆరోగ్యం, చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని ప్రిన్సిపాల్ జి.రామదాసు తెలిపారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొన్న ఆయన పిల్లలు పాఠశాలలో ఉండేలా మీరు చూసుకోవాలని, వారు బాగా చదివేలా, ఆరోగ్యంగా ఉండేలా తాము చూసుకుంటామన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థుల అభ్యసన సామర్థ్యం మెరుగుపరిచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, అనారోగ్యం బారినపడిన పిల్లను వెంటనే ఆస్పత్రికి తరలించి, వైద్యసేవలు అందిస్తున్నామన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీ పనులు పునఃప్రారంభం

తెర్లాం: మండలంలోని వెలగవలస గ్రామంలో ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం) పనులు ఆదివారం పునఃప్రారంభమైయ్యాయి. గతంలో టీడీపీ హయాంలో వెలగవలస పంచాయతీకి చెత్త సంపద తయారీ కేంద్రం మంజూరైంది. అప్పట్లో ఉపాధి హామీ పథకం నిధులతో కొంతమేర పనులు జరిగాయి. ఆ తర్వాత పనులు నిలిచిపోయాయి. ఎస్‌డబ్ల్యూపీసీల నిర్మాణానికి ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో ప్రస్తుతం మళ్లీ చెత్త సంపద కేంద్రం నిర్మాణ పనులు ఊపందుకోవడం గమనార్హం.

ఘనంగా రామయ్యతండ్రి సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్



దుర్గాదేవికి ముర్రాటలు తీసుకెళ్తున్న భక్తులు



మొక్కులు తీర్చేందుకు అమ్మవారి ఆలయానికి తరలివెళ్తున్న భక్తులు



ఆకట్టుకున్న తప్పెటగుళ్ల ప్రదర్శన



పారాదిలో ఘటాలను ఊరేగిస్తున్న దృశ్యం

రాజాం: మండలంలో బొమ్మినాయుడువలస గ్రామంలో రామయ్యతండ్రి సంబరాలను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రామయ్యతండ్రి ఘటాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ రేగిడి, వంగర మండలాల కన్వీనర్లు వావిలపల్లి జగన్మోహనరావు, కరణం సుదర్శనరావు, బొమ్మినాయుడువలస సర్పంచ్ వంజరాపు విజయ్‌కుమార్ తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ సంబరాలు

సంతకవిటి: మండలంలో మందరాడ గ్రామంలో ఆదివారం దుర్గమ్మ సంబరాలు నిర్వహించారు. జామి కుటుంబాలు పెద్ద ఎత్తున ముర్రాటలు దుర్గాదేవికి సమర్పించి పూజలు నిర్వహించారు. మందరాడ, కాకరాపల్లి గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన ఎల్లమ్మతల్లి సంబరాలు

బొబ్బిలి రూరల్: మండలంలోని ముత్తాయవలస గ్రామంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఎల్లమ్మ తల్లి సంబరాలు ఆదివారం ముగిశాయి. ఉదయం పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది పంటలు బాగా పండాలని, అందరూ ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నారు. సంబరాల్లో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి.

బొబ్బిలి రూరల్: మండలంలోని కలువరాయి గ్రామంలో సింహాద్రి అప్పన్న సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చేపట్టిన తప్పెటగుళ్ల ప్రదర్శన ఆకట్టుకుంది.

అన్నప్రసాద వితరణ



అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి గాయత్రికాలనీలోని గాయత్రిదేవి ఆలయం వద్ద ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల జరిగిన గాయత్రిదేవి యాత్రను పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆలయ ధర్మకర్త కె.వివేకానందరావు తెలిపారు. గాయత్రికాలనీతోపాటు పెనుబాక, రాజాం, కొత్తవలస, కొండంపేట తదితర గ్రామాలకు చెందిన సుమారు 1500 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



బాడంగి: గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

బాడంగి: విద్యార్థి స్థాయి నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ ఆర్.దుర్గాప్రసాద్ సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి వచ్చిన విద్యార్థులతో వివిధ కథల పుస్తకాలు చదివించారు. మరికొంతమంది విద్యార్థులకు కంప్యూటర్ ఆధారంగా ఎం.ఎస్ పెయింటింగ్ అంశంపై అవగాహన కల్పించారు.



తెర్లాం: తాము గీసిన చిత్రాలను చూపిస్తున్న విద్యార్థులు

చిత్రలేఖనం పోటీలు..

తెర్లాం: చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు ఆదివారం నిర్వహించారు. లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి మాట్లాడుతూ చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ విద్యార్థులు రాణించాలన్నారు.

వాసవీక్లబ్ సేవలు విస్తృతం చేయాలి



మాట్లాడుతున్న సంతోష్ చక్రవర్తి

రాజాం సిటీ: 'వాసవీక్లబ్ మన రాజాం–సారథి' సేవలు మరింత విస్తృతం చేయాలని క్లబ్ ఇంటర్నేషనల్ ట్రెజరర్ ఐఎస్‌వీ సంతోష్ చక్రవర్తి అన్నారు. స్థానిక వాసవీ కల్యాణ మండపంలో 'వాసవీక్లబ్ వనిత కాంతి మనరాజాం–సారథి' నూతన శాఖను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు పురుషుల క్లబ్ ద్వారా సేవలు అందించామని, ఇకమీదట వనిత కాంతి ద్వారా సేవలు విస్తృతం చేయనున్నట్లు చెప్పారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన పేద విద్యార్థులను ఆర్థికంగా ప్రోత్సహించి ఉన్నత చదువులకు సహకరించాలని కోరారు. పేదలు, అనాదలకు చేయూతనందించి వారి ఉన్నతికి తోడ్పడాలని కోరారు. అనంతరం వనిత కాంతి నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కె.శాంతి, కార్యదర్శిగా హెచ్.సుబ్బలక్ష్మి, ట్రెజరర్‌గా వి.ఝాన్సీరాణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ గవర్నర్ ఆత్మకూరి సతీష్, సభ్యులు ఎ.రత్నావతి, బీవీపీఎస్ రామయ్య, డాక్టర్ జి.రవికుమార్, వి.జగన్మోహనరావు, కె.వెంకటరావు, సాంబమూర్తి, కె.సాయిప్రశాంత్‌కుమార్, కె.చంద్రావతి, బి.నగేష్, వి.అంబరీష్, వి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



డోలపేటలో క్లోరినేషన్ చేస్తున్న కార్మికులు

రాజాం: పట్టణంలోని డోలపేట, సారథిరోడ్డు, వాసవీనగర్ తదితర ప్రాంతాల్లో ఆదివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పారిశుద్ధ్య కార్మికులు రోడ్డుపై ఉన్న చెత్తకుప్పలు తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ఎంవీ నాగరాజు పనులను తనిఖీ చేశారు. అనంతరం పరిసరాల పరిశుభ్రత, క్లీన్ ఏపీ కార్యక్రమం లక్ష్యాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

రామభద్రపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమామణి ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. మండల అభివృద్ధే ప్రధాన అజెండాగా ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు హాజరుకానున్నారని, మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని కోరారు.

బొబ్బిలి రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 16వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అల్లు భాస్కరరావు ఆదివారం తెలిపారు. ఎంపీపీ శంబంగి లక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులంతా సమగ్ర సమాచారంతో హాజరు కావాలని ఆయన కోరారు.

కోడూరు పుణ్యక్షేత్రంలో సప్తవారాల ఆరాధన

బాడంగి: మండలంలోని కోడూరు క్రైస్తవ పుణ్యక్షేత్రంలో సప్తవారాల ఆరాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఫాదర్ పి.యుగంధకుమార్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతీ వారంలో వచ్చే శనివారం అఖండజపమాల, సిలువమార్గం, దివ్యసత్ప్రసాద ఆరాధన, వాక్య పరిచర్య, దివ్యబలి పూజ నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే మార్చి 11వ తేదీన పాపపశ్చాత్తాప పాదయాత్ర ఉంటుందన్నారు.

గ్రామ వలంటీర్ ఖాళీల భర్తీ

వంగర: మండలంలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్దూరులో 2, శివ్వాంలో 2, ఎం.సీతారాంపురం, తలగాం, కింజంగి గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులకు 15న ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

చెరుకు ట్రాక్టర్లతో ట్రాఫిక్ సమస్య



చెరుకు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్

రాజాం సిటీ: నిత్యం రద్దీగా ఉండే రాజాం–పాలకొండ రోడ్డులో చెరుకు లోడు ట్రాక్టర్లతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడంలేదని వాహన చోదకులు అంటున్నారు. పగలు–రాత్రి తేడా లేకుండా నిత్యం సంకిలిలోని ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారానికి చెరుకు లారీలు, ట్రాక్టర్లతో తరలిస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. రద్దీ సమయాల్లో కాకుండా రాత్రి సమయాల్లో చెరుకు తరలించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు వాహనాల వేలం

రాజాం సిటీ: రాజాం టౌన్, రూరల్ సర్కిల్ స్టేషన్ పరిధిలోని ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 13న వేలం వేయనున్నట్లు సీఐలు రవికుమార్, ఉపేంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు ద్విచక్ర వాహనాలు, ఆల్టో కారు, ఆటోలు వేలంలో ఉన్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు రాజాం టౌన్ సర్కిల్ కార్యాలయం వద్ద నిర్వహించే బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు.

మాజీ సర్పంచ్‌కు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పరామర్శ



వేణుగోపాలనాయుడును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

రేగిడి: మండలంలోని అంబకండి మాజీ సర్పంచ్ లావేటి వేణుగోపాలనాయుడు తల్లి వరహాలమ్మ ఇటీవల మృతిచెందారు. కార్యకర్తల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆదివారం వేణుగోపాలనాయుడును పరామర్శించారు. మాతృమూర్తి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ఓదార్చారు. వరహాలమ్మ మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. పరామర్శించిన వారిలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, సర్పంచ్‌లు కెంబూరు వెంకటేశ్వరరావు, కరణం శ్రీనివాసరావు, సవలాపురపు రమేష్‌నాయుడు, గార రమణ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పుర్లి గోపాలకృష్ణ, లావేటి గణపతిరావునాయుడు, లావేటి హరిబాబు, ఎవర్న సత్యంనాయుడు తదితరులు ఉన్నారు.

మనసున్న వారు ఆదుకున్నారు..

- ఒంటరి వృద్ధుడికి మమత చారిటబుల్ ట్రస్ట్ చేయూత



మధురవాడ పీహెచ్‌సీ వద్ద వృద్ధుడిని గుర్తించి తరలిస్తున్న మమత చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మమత, పీఎం పాలెం పోలీసులు

అల్లిపురం: నేటి తరం పిల్లలకు వృద్ధులైన తల్లిదండ్రులు భారమవుతున్నారు. వారిని వదిలించుకునేందుకు రోడ్లపై వదిలిపెట్టి చేతులు దులిపేసుకుంటున్నారు. అలాంటి ఒక వృద్ధుడిని కడుపున పుట్టిన వారో, బంధువులో తెలియదు రోడ్డు మీద వదిలి వెళ్లిపోవటంతో అతను తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. అతన్ని ఎవరో తీసుకువచ్చి మధురవాడ పీహెచ్‌సీ వద్ద బయట వదిలిపెట్టి పోవటంతో బొబ్బిలిలోని సీతారాంపురం గ్రామానికి చెందిన జగన్నాథం గత మూడు రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఎవరైనా ఎవరి కోసం చూస్తున్నావని అడిగితే తనను ఎవరో తీసుకువచ్చి వదిలేశారని, తనకు ఎక్కడైనా ఆశ్రయం కల్పించాలని వేడుకుంటున్నాడు. దీంతో ఎవరో వాట్సాప్‌లో రికార్డు చేసి సోషల్ మీడియాలో పెట్టారు. దీంతో విషయం తెలుసుకున్న మమత చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మమత పీఎం పాలెం పోలీసుల సహకారంతో ఆ వృద్ధుడి వివరాలు తెలుసుకున్నారు. అతనికి కళ్లు కనపడకపోవటంతో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. అతనికి పెందుర్తి లయోలా ఓల్డేజ్ హోమ్‌లో ఆశ్రయం కల్పించారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు ఓల్డేజ్ హోంలో సంప్రదించాలని తెలిపారు.

మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట



రామభద్రపురం పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులకు సూచనలిస్తున్న సీఐ తిరుమలరావు

రామభద్రపురం: మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నామని సీఐ తిరుమలరావు తెలిపారు. మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్‌ను ఆదివారం పరిశీలించిన ఆయన రామభద్రపురం అంతర్‌రాష్ట్ర కూడలి కావడంతో ఇక్కడి సరిహద్దు ప్రాంతంలోని ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి గంజాయి, ఖైనీ, గుట్కా వంటి మాదకద్రవ్యాలు అక్రమ రవాణా జరిగే అవకాశం ఉందన్నారు. ఆ అక్రమ రవాణా జరగకుండా ఉక్కుపాదం మోపేందుకే ప్రధాన కూడళ్ల వద్ద పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం వాహన తనిఖీలు చేపట్టి, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వాహనదారులను హెచ్చరించారు. ఆయన వెంట ఎస్‌ఐ సురేంద్రనాయుడు, సిబ్బంది సత్యనారాయణ ఉన్నారు.

ఓటర్‌కార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలి



వెలగవలసలో ఓటర్‌కార్డుకు ఆధార్ అనుసంధానం చేయడాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

తెర్లాం: ఓటర్‌కార్డుకు ఆధార్ నంబర్ అనుసంధానం చేయాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు సూచించారు. మండలంలోని వెలగవలస గ్రామంలో చేపడుతున్న ఓటర్–ఆధార్ అనుసంధాన ప్రక్రియను పరిశీలించిన ఆయన మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్ల ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని బీఎల్‌ఓలకు సూచించారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులంతా ఓటర్లుగా తమపేర్లు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. మరణించిన, గ్రామాలను శాశ్వతంగా విడిచి వెళ్లిపోయిన ఓటర్లను ఓటర్ల జాబితాల నుంచి తొలగించాలన్నారు. కార్యక్రమంలో వెలగవలస పంచాయతీ కార్యదర్శి మల్లిఖార్జున, వీఆర్‌ఓ, ఓటర్లు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో పంటకు మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రాజాం: సేంద్రియ ఎరువులతో సాగు లాభదాయకమని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ డి.కిరణ్ అన్నారు. మండలంలోని పొగిరి, బొద్దాం, గారాజుచీపురుపల్లి తదితర గ్రామాల్లో కూరగాయల సాగు రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానంపై ఆదివారం అవగాహన కల్పించారు. జీవామృతం, కషాయాల వినియోగంతో పంటను ఆశించే చీడపీడలను నివారించవచ్చన్నారు. వేపాకు కాషాయం తయారీ విధానాన్ని, వినియోగించే పద్ధతులను వివరించారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారిస్తే పెట్టుబడులు తగ్గించుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ అల్లు నారాయణమ్మ, రైతులు పాల్గొన్నారు.

బుల్లెమ్మ పేరంటాలకు పూజలు



రేగిడి: బుల్లెమ్మ పేరంటాలను దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ విక్రాంత్, జెడ్పీటీసీ ఇందుమతి తదితరులు

రేగిడి: రేగిడి గ్రామంలో మామిడి కుటుంబీకుల ఇలవేల్పు బుల్లెమ్మ పేరంటాల పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. బుల్లెమ్మ అమ్మవారికి మామిడి కుటుంబీకులంతా భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సంబరాల్లో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రేగిడి, పాలకొండ జెడ్పీటీసీలు పాలవలస ఇందుమతి, పాలవలస గౌరీపార్వతి, మామిడి జగన్నాథంనాయుడు, సర్పంచ్ కిమిడి రవికుమార్, మామిడి వెంకటరావు, పాలవలస దవళేశ్వరరావు, రేగిడి భజన బృందం సభ్యులు మామిడి శివప్రసాద్ తదితరులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.